# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 325 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 07, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## తెలంగాణ వ్యాప్తంగా బడిబాట ప్రారంభం




**హైదరాబాద్,జూన్6(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి బడిబాట ప్రారంభమైంది. జూన్ 19వరకు కొనసాగనున్న బడిబాటలో భాగంగా.. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ స్కూళ్లలో చదివితే వచ్చే విద్యా, అవకాశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించనున్నారు. బడిబాట ప్రోగ్రాంలో భాగంగా జూన్ 12న సీఎం రేవంత్ రెడ్డి స్కూళ్లను పున:ప్రారంభించనున్నారు. పాఠశాలల రీ ఓపెన్ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించనున్నారు సీఎం, మంత్రులు. రాష్ట్రవ్యాప్తంగా 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

## లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్?

- రాహుల్ ఎంపికకే మొగ్గు చూపుతున్న కాంగ్రెస్ ఎంపిలు



**న్యూఢిల్లీ,మే6(నమస్తే ఉదయం):** ఊహించని రీతిలో ప్రతిపక్ష కూటమి పుంజుకోవడం వల్ల దేశ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. మొగ్గు పూర్తిగా బీజేపీపై వైపే ఉంటుందని అనుకున్నా ప్రతిపక్షాలూ గట్టిగానే నిలబడ్డాయి. ఇండియా కూటమితో కాంగ్రెస్ అనూహ్యంగా బలపడింది. 99 స్థానాలు సాధించి అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. ఈ క్రమంలో లోక్‌సబలో ప్రతిపక్ష నేత ఎవర్న చర్చ సాగుతోంది. ఈ మేరకు ఇండీ కూటమిలో

మిగతా.. 2లో





## మాకెన్ని మంత్రిపదవులు..?

- దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ హడావిడి
- ప్రభుత్వ ఏర్పాటులో బిజెపి, ఎన్‌డిఎ కసరత్తు
- నేడు ఎన్‌డిఎ, బిజెపి ఎంపిల భేటీలో నేతగా మోడీ ఎంపిక
- మోదీ కేబినెట్‌లో ఉన్న పలువురు మంత్రులకు ఉద్వాసన
- కీలక మంత్రి పదవులపై దృష్టి పెట్టిన టిడిపి, జెడియూ
- పార్టీ అధ్యక్షుడు నడ్డాను తప్పించే యత్నం
- కొత్త అధ్యక్షుడి రేసులో శివరాజ్‌సింగ్ చౌహాన్?

**న్యూఢిల్లీ,మే6 (నమస్తే ఉదయం):** దేశరాజధాని హస్తినలో రాజకీయ వాతావరణం హడావిడి కనిపిస్తోంది. ఎన్‌డిఎ నేతల రాక, గెలిచిన ఎంపిలంతా ఢిల్లీకి చేరుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ముందు శుక్రవారం బిజెపి ఎంపిలతో మోడీ భేటీ కానున్నారు. అలాగే ఎన్‌డిఎ పక్ష ఎంపీలతోనూ వేరుగా భేటీ కానున్నారు.

వీరంతా కలిసి మోడీని నేతగా ఎన్నుకున్న తరవాత, ఎన్‌డిఎ నేతలతో కలసి మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుంటారు.

మిగతా.. 2లో

### ఎపిలో కూటమి గెలుపుతో

## మంచి రోజులు వచ్చాయి

- రిజర్వేషన్ల రద్దు పేరుతో దుష్ప్రచారం
- కాంగ్రెస్ తప్పడు ప్రచారంతోనే దెబ్బతిన్నాం
- తెలంగాణ ప్రజల గండెచప్పడుగా ఉంటాం
- భవిష్యత్‌లో తెలంగాణలో మరింత సత్తా చాటుతాం
- బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్6(నమస్తే ఉదయం):** భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని.. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో 47 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అత్యధిక ఓట్లు వచ్చాయి. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పోటీ చేయలేదు.. ఎంఐఎం పోటీ చేసింది. లోపాలు సరిదిద్దుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. 6 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. భాజపాకు

మిగతా.. 2లో

## ప్రక్షాళన దిశగా బిజెపి

- పార్టీ అధ్యక్షుడు నడ్డాను తప్పించే యత్నం
- కొత్త అధ్యక్షుడి రేసులో శివరాజ్‌సింగ్ చౌహాన్?



**న్యూఢిల్లీ,మే6(నమస్తే ఉదయం):** లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి అనుకున్న మేర ఫలితాలు రాకపోవడంతో పార్టీని ప్రక్షాళన చేసే దిశగా ఆలోచన చేస్తోంది. ఇప్పటికే పార్టీ అద్యక్షుడు నడ్డ పదవీకాలం ముగిసింది. ఎన్నికల ముందు అధ్యక్షుడి పదవీకాలాన్ని పొడిగించారు. ఈ క్రమంలో పార్టీ అధ్యక్షుడి మార్పు తథ్యమంటూ చర్చ లేచింది.ఇందులో భాగంగా బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను తప్పించి ఆ స్థానంలో మరో సీనియర్ నేతకు అవకాశం ఇవ్వాలని అనుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతలకు అవకాశం ఇచ్చే సూచనలు ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి సుదీర్ఘ కాలం

మిగతా.. 2లో

## చంద్రబాబుకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు



**హైదరాబాద్,మే6 (నమస్తే ఉదయం):** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు సిఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న తరుణంలో రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని రేవంత్ ఆకాంక్షించారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యలను పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి 135, జనసేన 21, వైఎస్‌ఆర్ సిపి 11, బిజెపి 8 సీట్లలో గెలిచిన విషయం తెలిసిందే. 175 సీట్లకు ఎన్ డిఎ కూటమి 164 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది.

## ప్రధాని మోడీతో పవన్ భేటీ

### కుమారుడు అకీరా నందన్ పరిచయం

**న్యూఢిల్లీ,జూన్6(నమస్తే ఉదయం):** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి జయకేతనం ఎగురవేయడమే గాకుండా.. జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఘన విజయాన్ని సాధించింది.





## చురుకుగా రుతుపవనాలు

### తెలంగాణలో వర్షాలు ప్రారంభం


### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

**హైదరాబాద్,జూన్6(నమస్తే ఉదయం):** నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఈనెల 3న రాష్ట్రంలోని ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..ప్రస్తుతం తెలంగాణ లోని నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ గుండా రుతుపవనాలు కదులుతున్నట్లు చెప్పింది. 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు

మిగతా.. 2లో



- యమునా మిగులు నీటి విడుదల చేయండి
- హర్యానా, హిమాచల్ ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం



## ఢిల్లీలో తీవ్రమైన నీటి సమస్య

**న్యూఢిల్లీ,మే6(నమస్తే ఉదయం):** దేశ రాజధాని ఢిల్లీని తీవ్రమైన నీటి సంక్షోభం వెంటాడుతోంది. అక్కడి ప్రజలు నీటి చుక్క కోసం ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ నీటి సంక్షోభాన్ని తీర్చడానికి యమునా మిగులు నీటిని విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఆదేశిం చింది. ఢిల్లీకి అదనపు నీటిని అందించాలని హర్యానా, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీకి హిమాచల్ ప్రదేశ్ ఇస్తున్న నీటి వివరాలను కోర్టుకు ఇవ్వాలని ఎగువ యమునా నది బోర్డును ఆదేశించింది. మరోవైపు నీరు వృధా కాకుండా చేరసుకోవాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని కోరింది. ఢిల్లీలో నీటి

మిగతా.. 2లో

## స్టాక్ మార్కెట్‌లో భారీ స్కామ్

### జెపిసితో విచారణ జరిపించాలి

### కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ,జూన్6(నమస్తే ఉదయం):** స్కాక్ మార్కెట్ల స్కాంపై జేపీసీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. జూన్ 3న స్టాక్ మార్కెట్లు స్టాక్ మార్కెట్లు పెరుగుతాయని హోంమంత్రి చెప్పారని.. ఈ విషయం ఆయనకు ఎలా తెలుసని ప్రశ్నించారు. ఇది స్టాక్ మార్కెట్లో అత్యంత పెద్ద స్కాం అన్నారు. స్టాక్ మార్కెట్ల విషయంపై మొదటిసారిగా ప్రధాని మోదీ మాట్లాడారన్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా తమ విధులను దుర్వినియోగం చేశారన్నారు. జూన్ 3 పెరిగిన స్టాక్ మార్కెట్లు.. జూన్ 4న పడిపోయాయన్నారు. ఎన్నికల అనంతరం మీడియా తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇచ్చే విషయంలో మోదీ ప్రమేయం ఉందని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. 20 కోట్ల మంది భారతీయులు స్టాక్ మార్కెట్లపై ఇన్వెస్ట్ చేశారన్న ఆయన... మోసాలపై జెపిసి విచారణ జరగాలని అన్నారు. ఫారెన్ ఇన్వెస్టర్లకు .. ఎగ్జిట్‌పోల్స్‌కు ఏమైనా సంబంధం ఉందా.. ఎగ్జిట్ పోల్స్ చేసిన వారికి బీజేపీతో సంబంధం ఉందా.. స్కాక్ మార్కెట్లు పడిపోవడంతో ఇన్వెస్టర్లు 30 లక్షల కోట్లు నష్టపోయారన్నారు.



## సిఎం రేవంత్‌తో వివేక్ కుటుంబం భేటీ

### గడ్డం వంశీకృష్ణను అబినందించిన సిఎం

**హైదరాబాద్,జూన్6(నమస్తే ఉదయం):** హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డిని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు మర్యాదపూర్వంగా కలిశారు. పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచి న గడ్డం వంశీకృష్ణను

మిగతా.. 2లో

# మాకెన్ని మంత్రిపదవులు..?

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి కోరుతూ లేఖను అందచేస్తారు. ఈ క్రమంలో 8న మోడీ ప్రమాణస్వీకారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్‌డిఎ కూటమి పార్టీలతో కలసి బిజెపి మరోమారు అధికారం చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమిలో భాగస్వామ్య పార్టీలైన టిడిపి, జెడియు కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కీలకంగా మారాయి. ఈ పార్టీలు తమ ప్రధాన డిమాండ్లను మోడీ ముందుంచి నట్లు తెలుస్తోంది. అధికారికంగా బయటకు వెల్లడించనప్పటికీ బుధవారం జరిగిన ఎన్‌డిఎ సమావేశంలో మిత్రపక్ష పార్టీలు పదవుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, కీలక శాఖలను తమకు కేటాయించాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. కాగా, ఎన్‌డిఎ కూటమిలో 16 ఎంపీ సీట్లు గెలిచి కీలకంగా మారిన టిడిపి.. కొత్త ప్రభుత్వంలో ఐదు మంత్రి పదవులను ఆశిస్తున్నట్లు సమాచారం. లోక్‌సభ స్పీకర్, ఆర్థికశాఖ సహాయమంత్రి పదవులతో సహా ఐదు మంత్రిపదవులను డిమాండ్ చేసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాగే రోడ్లు, పంచాయతీరాజ్, ఆరోగ్యం, విద్య వంటి కీలకమైన శాఖలపై టిడిపి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ శాఖల్లో కూడా టిడిపి మంత్రి పదవులను కోరే అవకాశముందని వార్తలొస్తున్నాయి. బీహార్‌లో 12 సీట్లు గెలుచుకున్న జెడియు కొత్త ప్రభుత్వంలో రైల్వే మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కర్ణాటకలో జెడిఎస్ పార్టీ రెండు ఎంపి సీట్లే గెలిచింది. ఈ పార్టీ వ్యవసాయ శాఖపై దృష్టిపెట్టినట్లు వార్తలొస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో సరైన మెజార్టీ బీజేపీకి రాలేదు.. దీంతో కూటమి పార్టీలైన టీడీపీ, జేడీయూ మద్దతు చాలా కీలకం.. ఈ క్రమంలో ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తే మాకేంటి అని ప్రాంతీయ పార్టీలు తమ డిమాండ్లను ముందుంచే అవకాశాలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో ఎన్డీయే ఎంపీల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ ఎంపీలంతా ఢిల్లీకి రానున్నారు. ఈ రాత్రికి బీజేపీ సీఎంలు, డిప్యూటీ సీఎంలు అందరూ ఢిల్లీకి రానున్నారు. అయితే గురువారం జనతాదళ్ ముఖ్య నేత కేసీ త్యాగి మీడియాతో మాట్లాడుతూ.. ఆ పార్టీ డిమాండ్స్ గురించి ప్రస్తావించాడు. జేడీయూ పూర్తి సపోర్ట్ బీజేపీకి ఉంది.. స్పెషల్ షరతులు ఏం లేవు, కానీ అగ్నిపథ్ పథకంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉంది.. ఆ స్కీంపై కేంద్ర ప్రభుత్వం, రక్షణశాఖ ఒకసారి సమీక్షించాలని కోరారు. అలాగే బీహార్‌కు స్పెషల్ స్టేటల్ అనేది ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్, అది జేడీయూ నాయకుల మనసులో ఉన్న కోరికని ఆయన చెప్పుకొచ్చాడు. అటు టీడీపీ పార్టీ వర్గాలు కూడా బీజేపీకి మద్దతు ఇస్తే వచ్చే ప్రతిఫలం గురించి చర్చిస్తున్నారు. ఐటీ, విద్యాశాఖ లాంటి నాలుగు కీలక కేంద్ర మంత్రి పదవులను టీడీపీ పార్టీ డిమాండ్ చేస్తోందని సమాచారం.. ఇరు పార్టీలు ఈ కింద డిమాండ్లను బీజేపీ ముందు ఉంచుతాయని ఆయా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదిలావుంటే హస్తినకు బీజేపీ నేతలు వెళుతున్నారు. ఎంపీలుగా విజయం సాధించిన తెలంగాణ ఎంపిలు బండి సంజయ్, డీకే అరుణ, రఘునందనరావు తదితరులు ఢిల్లీకి వెళుతున్న వారిలో ఉన్నారు. నేడు ఢిల్లీలో ఎన్డీఏ ఎంపీల సమావేశం జరగనుంది. ఇప్పటికే ఢిల్లీలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు. ప్రస్తుతం మోదీ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఎంపీలుగా గెలుపొందిన పార్టీ నేతలతో ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. అనంతరం తర్వాత మిత్రపక్షాల నేతలు వేరుగా భేటీ అవుతారు. మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాలి.. ఏ పార్టీకి ఎన్ని పదవులివ్వాలో చర్చిస్తారు. రాజకీయ అనిశ్చితికి ఆస్కారం లేకుండా త్వరగా ఈ పక్రియ ముగించాలని చంద్రబాబు, నితీశ్ గట్టిగా సూచించినట్లు ఎన్డీయే వర్గాలు తెలిపాయి. కాగా ప్రస్తుతం మోదీ కేబినెట్‌లో ఉన్న పలువురు మంత్రులకు ఉద్వాసన తప్పదని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఈసారి హోంశాఖ కాకుండా వేరే శాఖను కేటాయించ వచ్చన్న ప్రచారం జరుగుతోంది. టీడీపీ, జేడీయూ ఎంపీలకు కీలక మంత్రిపదవులు దక్కే అవకాశాలున్నాయని ఎన్డీయే వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. మోదీ కేబినెట్‌లో చేరాలని తమ పార్టీ నిర్ణయించినట్లు చంద్రబాబు వెల్లడించారు.

# చురుకుగా రుతుపవనాలు

మొదటిపేజీ తరువాయి..

రుతుపవనాలు విస్తరిస్తాయని, కదలికలు ఇదే తరహాలో ఉంటే వారం రోజుల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తాయని అంచనా వేస్తోంది. దీని కారణంగా పలుజిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మెదక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా రుతుపవనాలు వ్యాపిస్తున్నాయి.

కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అలర్ట్? జారీ చేసింది, తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దక్షిణ తెలంగాణాలో అత్యధికంగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటి పూట కొంతసేపు గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నప్ప టికీ.. ఆశాశం మేఘావృతం కావడంతో క్రమంగా ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గుతూ వస్తోంది.

సాయంత్రానికి పూర్తిగా చల్లని వాతావరణం ఏర్పడుతోంది. రెండు రోజులు రాష్ట్రంలో ఉష్ణో గ్రతలు సాధారణం, అంతకంటే తక్కువగా నమోదు కావొచ్చని ఆ శాఖ అంచనా వేసింది. నిజామాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత: దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో తెలంగాణలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని పేర్కొంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే నిజామాబాద్‌లో 40.1 డిగ్రీ సెల్సీయస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.5 డిగ్రీ సెల్సీయస్‌గా నమోదైంది.

## సిఎం రేవంత్‌తో వివేక్ కుటుంబం భేటీ

మొదటిపేజీ తరువాయి..

సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. వంశీకృష్ణతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, విశాఖ ఇండస్ట్రీస్ ఎండీ గడ్డం సరోజ వివేక్ ఉన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు సాధించి తమ పాలనకు రెఫరెండంగా చాటుకుంది. పెద్దపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపీగా గడ్డం వంశీకృష్ణ దాదాపు లక్షా 30 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గంలో 15 లక్షల 96 వేల 430 ఓట్లకుగాను 10లక్షల 83వేల 453 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు 4లక్షల 80వేల 994 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్‌కు 3లక్షల 49వేల 339 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 1లక్షల 94వేల 821 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1లక్షల 31వేల 771 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.


## ప్రధాని మోడీతో పవన్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. తాజాగా జరిగిన ఎన్డీయే కూటమి నేతల సమావేశానికి తన కుటుంబంతో సహా హాజరయ్యారు. సతీమణి అన్నాలెజినోవా కొణిదెలతో పాటు తన కుమారుడు అకీరా నందన్‌ను సైతం దిల్లీకి తీసుకెళ్లారు. కూటమి నేతల భేటీ ముగిసిన అనంతరం ప్రధాని మోదీకి తన కుటుంబాన్ని పరిచయం చేశారు. ఈసందర్భంగా అకీరా ప్రధాని మోదీకి నమస్కరిస్తుండగా అతడి భుజంపై చేయి వేసి మోదీ మాట్లాడుతున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. ఎన్నికల ఫలితాలు ముగిసిన అనంతరం పవన్‌కల్యాణ్‌కు ఆయన సతీమణి హారతి ఇస్తున్న వీడియోలోనూ వెనక అకీరానే కనిపించాడు. ఆ తర్వాత తెదేపా అధినేత చంద్రబాబు వద్దకు వెళ్లినప్పుడు పవన్.. అకీరాను తీసుకెళ్లారు. చంద్రబాబుకు పరిచయం చేయడమే కాకుండా, ఆయన కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకోమని సూచించారు. ఫలితాల రోజున ఆ ఫొటోలు విపరీతంగా వైరల్ అయ్యాయి.

## టిటిడి బోర్డు ఛైర్మన్ పదవి అంటూ ప్రచారం

### ఫేక్ వార్తలను నమ్మొద్దన్న నాగబాబు



హైదరాబాద్,జూన్6 (నమస్తే ఉదయం): టిటిడి ఛైర్మన్ పదవి అంటూ వస్తున్న తప్పుడు వార్తల ప్రచారాలను నమ్మవద్దని జనసేనాని పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు స్పష్టం చేశారు. ఫేక్ వార్తల ప్రచారాలను నమ్మవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి, జనసేన విజయానికి సినీ నటుడు, పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు తీవ్రంగా శ్రమించారు. ముఖ్యంగా పిఠాపురంలో పవన్ విజయానికి అహర్నిశలు శ్రమించారు. ఈ నేపథ్యంలో నాగబాబు తిరుమల, తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ పదవిని చేపట్టబోతున్నారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు వైరల్ అయ్యాయి. గురువారం ఉదయం నుంచి ఈ వార్త ట్రెండింగ్‌లో ఉంది. ఈ విషయంపై నాగబాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ పోస్ట్ పెట్టారు. అంతేకాదు, తన భవిష్యత్ కార్యాచరణనూ వెల్లడించారు. 'దయచేసి అసత్య వార్తలను ఎవరూ నమ్మకండి. పార్టీ అధికారిక, నా సోషల్‌మీడియా ఖాతాల ద్వారా పోస్ట్ అయ్యే సమాచారాన్ని మాత్రమే విశ్వసించండి. దయచేసి ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేయకండి' అని పేర్కొన్నారు. చిరంజీవి ఇంటికి పవన్‌కల్యాణ్ వచ్చిన సందర్భంగా జరిగిన సెలబ్రేషన్స్‌లోనూ నాగబాబు కుటుంబం పాల్గొంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కల్యాణ్‌బాబు విజయం సాధించిన సందర్భంగా కుటుంబసభ్యులంతా కలిసి గెట్ టు గెదర్‌లా చిన్న పార్టీ చేసుకున్నామన్నారు. మెగా ఫ్యామిలీ అంతా ఈ వేడుకకు వచ్చినట్లు చెప్పారు. ఏ పరిస్థితుల్లోనైనా తమ కుటుంబం పవన్‌కు అండగా ఉంటుందన్నారు. పార్టీకి సేవ చేయడం తప్ప పదవులపై తనకు ఆలోచన లేదన్నారు. జనసేనను ఇంకా ఉన్నతస్థానాలకు ఎలా తీసుకెళ్లాలా? అన్న ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అలాగే క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం పైనా దృష్టి పెడతామని స్పష్టం చేశారు.

## చిన్న పత్రికలను చులకనగా చూస్తే ఇలాగే జరుగుతుంది...

మొదటిపేజీ తరువాయి..

వార్తలు రాస్తే అక్రమ కేసులు పెట్టారు, సిఐడి తో వేధింపులకు గురి చేశారు,
ఒక్కసారి కూడా ప్రెస్ మీట్ పెట్టని సీఎం ఎవరైనా ఉన్నారంటే అది జగన్ రెడ్డి మాత్రమే. గెలిచిన వెంటనే నారా చంద్రబాబు నాయుడు గారు ప్రెస్ మీట్ పెట్టి జర్నలిస్టుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు
గత ప్రభుత్వం ప్రాంతీయ పత్రికలను గుర్తించలేదు యాడ్స్ కాదు కదా కనీసం అక్రిడేషన్ కూడా సరిగా ఇవ్వలేదు. ఏ రోజు మీ సమస్యలు ఏంటి అని ఎప్పుడు కూడా జర్నలిస్టులను అడగలేదు. చిన్న పత్రికల ఎడిటర్లకు కనీసం అసెంబ్లీ పాస్ కూడా ఇవ్వలేదు.
అంతెందుకు అధికారుల దగ్గర కూడా విలువ లేకుండా చేసిన ఘనుడు జగన్. అసలు మన పత్రికలకు మనుగడే లేకుండాపోయింది.
చిన్న పత్రికల శాపం వల్లే ఘోర పరాజయం వైసిపికి వచ్చింది..
జగన్ కి వంత పలికిన అధికారులు అంతా తస్మాత్ జాగ్రత్త. ప్రాంతీయ పత్రిక ఎడిటర్లు అంత ఐక్యమవుదాం. గత ప్రభుత్వంలో అమలు గాని హామీలను ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అమలు చేస్తారని ఆశిద్దాం. ప్రభుత్వానికి చిన్న పత్రికల తరఫున ఎప్పుడు మద్దతు ఉంటుందని తెలియజేస్తున్నాము. ప్రాంతీయ పత్రికలకు యాడ్స్ తోపాటు, అక్రిడేషన్లు, ఇండ్ల స్థలాలు కాకుండా, అసెంబ్లీ పాసులు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాము. నూతనంగా కొలువుతున్న ప్రభుత్వానికి మా అందరి తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ. ఆ దేవుడు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదలకు సంఘం, రాష్ట్ర అధ్యక్షులు కే. ప్రసాద్ బాబు, ప్రధాన కార్యదర్శి నందిగం కోటేశ్వరరావు, వల్లూరి రవి శేఖర్, రమేష్ కాకర్ల, తదితరులు తెలిపారు.

# ఇక సింగరేణిని పరుగులు పెట్టిద్దాం

### ప్రైవేటుతో పోటీపడేలా చేద్దాం

### అధికారులకు సిఎండి బలరామ్ సూచన

హైదరాబాద్,జూన్6 (నమస్తే ఉదయం): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇకపై సింగరేణిలో పాలన పరుగులు పెట్టాలని సంస్థ సీఎండీ ఎన్ బలరాం సూచించారు. కోడ్ నేపథ్యంలో నిలిచిన సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులకు అందించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం ప్రైవేటు రంగంతో పోటీ పడేలా మన సామర్థ్యాలను, ఆలోచనా విధానాలను మార్చుకొని ముందుకు సాగాలని సూచించారు. సింగరేణి వ్యాపార విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయని.. అందరు అధికారులు, ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్థవంతంగా సకాలంలో నిర్వహించగలిగితే సంస్థను దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టవచ్చని సీఎండీ ధీమా వ్యక్తం చేశారు. సంస్థ చేపట్టిన ప్రాజెక్టులు, కొత్త కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ విషయంలో అన్ని విభాగాలు సమన్వయంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి 25కు పైగా శాఖల అధిపతులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఉత్పత్తి, రవాణాలపైనే నెలవారీగా సమీక్షలు నిర్వహించడం జరిగిందని.. ఇకపై ఇతర విభాగాల పనితీరుపైనా నెలవారీగా సమీక్ష నిర్వహించడం జరుగుతుందని సీఎండీ బలరాం తెలిపారు. ఆయా విభాగాలకు అప్పగించిన పనుల పురోగతిని నెలవారీగా తెలుసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా పని గంటల వినియోగంతోపాటు మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకమని తెలిపారు. విధుల పట్ల అలసత్వం, లక్ష్య సాధన పట్ల నిర్లక్ష్యం చూపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఆయా విభాగాల పనితీరులో మెరుగుదల కనిపించకపోయినా.. అప్పగించిన పనులను పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని



హెచ్చరించారు.

అదే సమయంలో సంస్థ ఉన్నతికి అంకిత భావంతో పనిచేసే వారికి మంచి గుర్తింపు ఇస్తామని తెలిపారు. ఉత్పత్తితోపాటు సంక్షేమం, రక్షణకు యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రక్షణ విషయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగానికి ఖర్చుకు వెనకాడకుండా చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎండీ గుర్తు చేశారు.

కంపెనీ అభివృద్ధికి ఇచ్చే మంచి సూచనలను స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు.

## ఢిల్లీలో తీవ్రమైన నీటి సమస్య

మొదటిపేజీ తరువాయి..

సమస్య మరింత తీవ్రమైంది. తాగు నీటి కోసం మూడు, నాలుగు నెలలుగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంజయ్ క్యాంప్ సహా చాలా కాలనీలు, బస్తీల్లో నీటి కరువు నెలకొంది. తాగునీటి కోసం వాటర్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ట్యాంకర్లు రాగానే దాని వెంట ఉరుకులు, పరుగులు పెడుతున్నారు ప్రజలు. ఎండాకాలం ప్రారంభం నుంచి ఇదే పరిస్థితి ఉంది. భూగర్భ జలాలు అడుగంటడం కూడా నీటి కరువుకు ప్రధాన కారణమైంది. ట్యాంకర్లు వచ్చినా...అవి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజలు. తాగు నీటి కోసం తాము, తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరుతు న్నారు. తక్షణమే తమకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జూన్ 7వ తేదీన 137 క్యూసెక్కుల యమునా మిగులు నీటిని హర్యానాలోని హథినికుండ్ బ్యారేజికి విడుదల చేయాలని సుప్రీం ఆదేశించింది. హథినీకుండ్ బ్యారేజికి విడుదలైన నీటిని నేరుగా ఢిల్లీలోని వజీరాబాద్‌కు విడుదల చేయాలని జస్టిస్ పికె మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంలో ఢిల్లీ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు సోమవారం లోగా సమ్మతి అఫడవిట్‌లను దాఖలు చేయాలని సుప్రీం కోరింది. కాగా, నీటి కొరతను తీర్చేందుకు గాను యమునా నది మిగులు జలాలను విడుదల చేసే విధంగా హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ప్రభు త్వాలను ఆదేశించాలని ఇటీవల ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ పి.కె మిశ్రా బెంచ్ విచారించింది. ఈమేరకు హర్యానా, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలను సుప్రీం ఆదేశించింది.

## ఎపిలో కూటమి గెలుపుతో మంచి రోజులు వచ్చాయి

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ ప్రజలు 35 శాతానికిపైగా ఓట్లు వేశారు. మాపై విశ్వాసం ఉంచి.. అధిక స్థానాల్లో గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క శాతం ఓటింగ్ మాత్రమే పెరిగింది. తెలంగాణలో చాలా చోట్ల భారాసకు డిపాజిట్లు రాలేదు. రాష్ట్ర ప్రజలు కాషాయ పార్టీకి అండగా నిలబడ్డారు. గతంలో రేవంత్‌రెడ్డి గెలిచిన మల్కాజిగిరిలో కూడా మేం గెలిచాం. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిద్దిపేట ఉన్న మెదక్‌లో విజయం సాధించాం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారో భాజపా ప్రశ్నిస్తుంది. అమిత్‌షాపై తప్పుడు కేసు పెట్టారు. హస్తం పార్టీ మోసాలను ప్రజలకు వివరిస్తాం. ఏపీలో అద్భుతమైన మెజార్టీతో ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. అక్కడి ప్రజలకు కృతజ్ఞతలని కిషన్‌రెడ్డి తెలిపారు.రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా సమిష్టిగా పనిచేస్తామని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అయిపోయిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాదు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై ఆరు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఢిల్లీకి పంపిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను ఇంకా నెరవేర్చడం లేదని గుర్తు చేశారు. ఫ్రీ ఆర్టీసీ బస్సు హామీ తప్ప ఏదీ నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ పోటీ చేసి బీజేపీని ఓడించాలని చూసిందని కిషన్ రెడ్డిఅన్నారు. కానీ వారు అనుకున్నది జరగలేదని వెల్లడించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా బీజేపీ అత్యధికంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లకు బలమైన ప్రత్యామ్నాయంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది. రాష్ట్రంలో బీజేపీ తెలంగాణ ప్రజల గుండెచప్పుడు అయ్యి సమస్యల గురించి నిలదీస్తామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు ఇటివల ఏపీలో చంద్రబాబు నాయుడు, పురంధేశ్వరి, పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి బ్రహ్మాండమైన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ ముగ్గురికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఏపీ ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్?

మొదటిపేజీ తరువాయి..

సంప్రదింపులు, చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఎవరుంటారన్న చర్చ ఇండీ కూటమిలో మొదలైంది. మొత్తం సేనను ముందుండి నడిపించిన రాహుల్ గాంధీకీ ఆ అవకాశం దక్కవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. బీజేపీ తరవాత ఎక్కువ సీట్లు వచ్చింది కాంగ్రెస్‌కే. అంటే ప్రతిపక్ష హోదా ఈ పార్టీకి వచ్చేసింది. అందుకే ఈ పార్టీకి చెందిన రాహుల్ గాంధీనే ప్రతిపక్ష నేతగా ఉంటారన్న చర్చ మొదలైంది. ప్రతిపక్షనేత గట్టిగా ఉంటేనే లోక్‌సభలో వాణి వినిపించడానికి అవకాశం ఉంటుంది. ప్రతిపక్ష నేతలకు ప్రాధాన్యం ఉంటుంది. కేబినేట్ మోదా కూడా వస్తుంది. ఈ క్రమంలో నాయకుడిగా ఎదుగేందుకు అవకాశం కూడా ఉంటుంది. రాహుల్ గాంధీయే విపక్ష నేతగా ఉండాలని కాంగ్రెస్ శ్రేణులు కూడా కోరుకుంటున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. అయితే...కాంగ్రెస్ పార్లమెంటరీ మీటింగ్‌లో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ రాహుల్ గాంధీయే ప్రతిపక్ష నేతగా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ట్విటర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. నేను ప్రజలను ఓట్లు అడిగింది రాహుల్ గాంధీ పేరు చెప్పుకునే. లోక్‌సభలో ఆయనే ప్రతిపక్ష నేతగా ఉండాలి. ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలంతా ఈ ప్రతిపాదనకు మద్దతునిస్తారని అనుకుంటున్నాను. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఏం నిర్ణయిస్తుందో వేచి చూస్తాం అని ట్వీట్ చేశారు.

## ప్రక్షాళన దిశగా బిజెపి

మొదటిపేజీ తరువాయి..

సిఎంగా పని చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఆయన్నే పార్టీ అధ్యక్ష పదవి వరించనున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఘన విజయం సాధించి రాష్ట్రంలో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ అధిష్ఠానం కొన్ని నెలల క్రితం శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించింది. నూతన ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ నియమితులయ్యారు. అయితే చౌహాన్ బీజేపీ సీఎంగా16 ఏళ్లకుపైగా పనిచేశారు. ఆయన్ని సీఎం పదవి నుంచి తొలగించినప్పటి నుంచి కొంత అసంతృప్తితో ఉన్నారు. తాజా ఎన్నికల్లో ఆయన ఎంపిగా గెలిచారు. దీంతో ఆయన్ని అధిష్టానం ఢిల్లీకి పిలిపించడంతో అధ్యక్ష పదవి ఆయన్ని వరించబోతోందనే చర్చ నడుస్తోంది. ఆయనతో పాటు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని సైతం అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో విదిషా నుంచి పోటీ చేసిన చౌహాన్ సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 8,21,408 మెజారిటీతో గెలుపొందారు. ఆయనకు11,16,460 ఓట్లు రాగా, రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ భాను శర్మ 2,95,052 ఓట్లతో సరిపెట్టుకున్నారు.

## మేడిగడ్డలో కొనసాగుతున్న గ్రౌటింగ్ పనులు

జయశంకర్ భూపాలపల్లి,జూన్6 (నమస్తే ఉదయం): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ లక్ష్మి బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో 18, 19 పియర్ల వద్ద ఇటీవల చేపట్టిన గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయి. గ్రౌటింగ్ యంత్రాల సాయంతో బరాజ్‌లో మొత్తం 85 గేట్లకు గాను గతంలో 78 గేట్లు ఎత్తివేయగా, దెబ్బతిన్న పియర్ల వద్ద ఉన్న 20, 21 గేట్లు ఎత్తేందుకు వీలుకాకపోవడంతో ఆర్క్ గ్రౌగింగ్ పరికరంతో కట్ చేసే పనులు జరుగుతున్నాయి. ఏడో బ్లాక్‌లో 16వ గేట్ ఎత్తగా, 17 గేటు ఎత్తేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్‌డీఏఎస్ సూచన మేరకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. బరాజ్‌లో లోపాలపై అధ్యయనం చేయడానికి బుధవారం వచ్చిన సీఎస్‌ఎంఆర్ఎస్ బృందం సభ్యుల పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ బృందం మరోవారం రోజులపాటు బరాజ్‌లో లోపాలపై పలు రకాల శాంపిల్స్‌ను సేకరించి క్షేత్ర స్థాయిలో పరిశీలన, పరీక్షలు చేయనున్నట్లు తెలిసింది. బరాజ్ దిగువన నీటి ప్రవాహానికి పియర్ల చుట్టూ ఉన్న ఇసుక కొట్టుకుపోకుండా యంత్రాల సాయంతో షీట్స్ అమర్చుతున్నారు. డౌన్, అప్ స్టీమ్‌లో సీసీ బ్లాక్‌లను తీసి అమర్చుతున్నారు.

# పాలమాకులలో బిజెపికి భారీ ఆధిక్యం

## విశ్వేశ్వర్ రెడ్డి విజయానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు: సుష్మ రాజభూపాల్ గౌడ్



**శంషాబాద్, జూలై 6( నమస్తే ఉదయం):** ఇటీవల ఫలితాలు విలువడిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం లో భారీ విజయం సాధించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి కీ పాలమాకుల ప్రజలు విశేషంగా ఆదరించారని పాలమాకుల మాజీ సర్పంచ్ పంతంగి సుష్మా రాజభూపాల్ గౌడ్ పేర్కొన్నారు. పాలమాకుల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి 818 ఓట్లు మాత్రమే లభించాయని. అధికార కాంగ్రెస్ పార్టీకి 935 ఓట్లు మాత్రమే లభించాయని అన్నారు. పాలమాకుల ప్రజలు భారతీయ జనతా పార్టీని ఆదరించి 2391 ఓట్లు వేసి దీవించాలని అన్నారు . విజ్ఞులైన పాలమాకుల ప్రజలు భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీకి. చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని బలపరుస్తూ పెద్ద సంఖ్యలో ఓట్లు వేసి బీజేపీని ఆశీర్వదించారనిఆమె తెలిపారు. బిజెపికి ఓట్లు వేసిన గ్రామ ప్రజలకు సుష్మ రాజభూపాల్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఈటెల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కూకట్‌పల్లి, జూన్ 6 (నమస్తే ఉదయం):** కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ జనసైనికులు, మహిళలు మల్కాజ్గిరి ఎంపీ గా అఖండ మెజార్టీతో గెలిచిన ఈటెల రాజేంద్ర ని తన నివాసంలో



కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కొల్లా శంకర్, వేముల మహేష్, కాకాని లక్ష్మణ్ రావు, డివిజన్ ప్రెసిడెంట్ కలిగినిడి ప్రసాద్, అడబాల షణ్ముఖ, ఎర్ర రఘు, మండలి అనిల్, ఆవుల రంగబాబు, పులగం సుబ్బు, విజయ్, యోగేష్ ,సురేష్ మరియు వీర మహిళలు అడబాల లక్ష్మి, సత్య ఎర్ర, రాధిక, జానవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు చర్యలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కూల్చివేత

### అధికారుల కక్ష మీద ఆగ్రహం వ్యక్తం చేసిన బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డ

**కూకట్‌పల్లి, జూన్ 6 (నమస్తే ఉదయం):** ఇందిరా నగర్ లో నివాసం ఉండే ప్రతి ఒక్కరి బాగు కోసం పాటు పడే బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీద కక్ష సాధింపు చర్యలలో భాగంగా అధికారులు పార్టీ కార్యాలయం



కూల్చివేశారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన బస్తివాసులు గత కొన్ని సంవత్సరాలుగా పొట్టకూటికోసం రోడ్డు పక్కన షెడ్లు తీసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. హఠాత్తుగా రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు పోలీస్ సిబ్బందిని తీసుకొని వచ్చి నిరుపేదల చిరు వ్యాపారాలపై నిర్దాక్షిణ్యంగా విరుచుక పడ్డారు.
పేదలు ఎంత ప్రాధేయ పడుతున్న వినకుండా ప్రతి షెడ్డును నేలమట్టం చేసి పేదల కడుపు మీద కొట్టారు.

సంఘటన స్థలంకు చేరుకున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంలో పేదలను కంటికి రెప్పలా కాపాడుకున్నామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదల పొట్ట మీద కొట్టడం దారుణం అని ఇలాంటి చర్యలు సరికాదని అన్నారు. పేదల మీద ఇలా విరుచుకుపడితే పేదవాళ్లతో కలిసి పోరాడుతామని తాము కన్నెర్ర చేస్తే అధికారులు రోడ్డుమీదికి వచ్చి డ్యూటీలు కూడా చేయలేరని, ప్రభుత్వం ఎవరిదైనా పేదల పక్షాన ఉండాలని పేదవాడి నోటి దగ్గర కూడు లాగా వద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లి రాజేశ్వర్ రావుని మర్యాదపూర్వకంగా కలిసిన సాయిబాబా నగర్ కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు...

**కూకట్‌పల్లి, జూన్ 6 (నమస్తే ఉదయం):** వివేకానందనగర్ లోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నివాసంలో కూకట్ పల్లి డివిజన్ సాయిబాబా నగర్ కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. మల్కాజిగిరి పార్లమెంట్ లో ఈటల రాజేందర్ విజయం సాధించిన నేపథ్యంలో వడ్డేపల్లి రాజేశ్వర్ రావు కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా నగర్ కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు శంకర్, కాశిరెడ్డి, ప్రదీప్, రమణారెడ్డి, చంద్ర శేఖర్, ప్రవీణ్, హరి, ఫణి, జనార్ధన్, చంద్రప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవు

### గ్రామాలలో బాల కార్మిక నిర్మూల వ్యవస్థపై అవగాహన కల్పించాలి

### పత్తి చేనులో పిల్లలను పనిలో పెట్టుకుంటే రెండేండ్ల జైల్లు శిక్ష

### పిల్లలను పనిలో పెట్టుకుంటే రైతులకు సీడ్ విత్తనాలు ఇవ్వొద్దు



**కేటిదొడ్డి,జూన్6(నమస్తే ఉదయం):** పత్తి విత్తన పంటలలో బాలలచేత పని చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేటి దొడ్డి ఎంపిడిఓ రాములు నాయక్ హెచ్చరించారు. గురువారం కేటిదొడ్డి మండల కేంద్రంలోని రైతు వేధికలో పత్తి పంటలలో బాలకార్మికుల నిరోధం బాలల విద్య కొనసాగింపుపై ఎంవిఎఫ్ ఆధ్వర్యంలో పత్తి విత్తన ఆర్గనైజర్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యతగా భావించాలని ప్రతి గ్రామ పంచాయతీలో 6 నుంచి 18 సంవత్సరాల పిల్లల జాబితా తీసుకొని ప్రతి ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలకు బడికి పంపించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు జూన్ నుండి అక్టోబర్ వరకు ప్రతినెల గ్రామ రైతులు, సీడ్ ఆర్గనైజర్లతో కలిసి పత్తి చేనులలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టాల ప్రకారం పిల్లలను పనిలో పెట్టుకుంటే 6 నెలల నుం చి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించడం జరు గుతుందన్నారు. కేటిదొడ్డి ఏఓ మహాలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలలో ఏఇఓలు పత్తి చేనులో పని చేస్తున్న బాలలను గుర్తించి బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేస్తామన్నారు. మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బాల కార్మికుల నిర్మూలనపై సీడ్ ఆర్గనైజర్లు పత్తి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్గనైజర్ లు సీడ్ విత్తనాలు రైతులకు ఇచ్చేటప్పుడు పత్తి పంటలలో పిల్లలను పెట్టుకోరాదని, పిల్లల చేత పని చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని రైతులకు వివరించాలన్నారు. అదేవిధంగా సీడ్ అసోసియేషన్ సభ్యుడు గొంగళ్ళ విజయ్ కుమార్ మాట్లాడుతూ బాల కార్మికుల నిర్మూలన వ్యవస్థపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎంవిఎఫ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ జూన్ నెల నుంచి 100% పిల్లలు బడికి హాజరయ్యే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేటి దొడ్డి మండలంలోని సీడ్ ఆర్గనైజర్ లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎఇఓలు, ఎంవి ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాయికుమార్, మండల కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ మొబిలైజర్స్ ఉషారాణి, రాజేశ్వరి, రమేష్, మల్దకల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు చిత్తుగా ఓడించినా కెసిఆర్ అహంకారం తగ్గలేదు



**కొత్తకోట, జూన్6(నమస్తే ఉదయం):** కెసిఆర్ లో తగ్గని అహంకారాన్ని చూసే ఉప ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడ ఇవ్వకుండా ప్రజలు తీర్పు ఇచ్చారనిని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

బిఆర్ఎస్‌కు ప్రజలు మరోసారి కర్రు కాల్చి వాత పెట్టారన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుం దని, కాంగ్రెస్‌కు పాలన చేత కావడంలేదని, కాంగ్రెస్‌ని గెలిపించి ప్రజలు తప్పు చేశారని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతుని తెచ్చుకున్నారంటూ కేసిఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

కాంగ్రెస్ ను గెలిపించడమే ప్రజల తప్పు అనడం అంటే, ప్రజా తీర్పును అవమానించడమే కదా?

గత పదేండ్లుగా అహంకారం తలకెక్కించుకొని నిరంకుశ పాలనను సాగించి త్యాగాలు చేసిన కుటుంబాలను నిర్లక్ష్యం చేసి తన కుటుంబమే ముఖ్యం తప్ప రాష్ట్రం కోసం త్యాగం చేసిన వారు కాదని కేసీఆర్ తమ జాగిరిగా పాలించి మహారాజులమని భావించుకున్నారు.

**అడుగడుగునా అబద్ధాలు...**

గత అసెంబ్లీ ఎన్నికలలో మొత్తం అబద్దాల ప్రచారాలు చేసి,గత పదేండ్లలో తాము చేసిన అభివృద్ధిని చెప్పకుండా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని, రైతుబంధు రాదని, మత కలహాలు జరుగుతాయని, ఢిల్లీ నుంచి పాలన సాగుతుందని, ఏడాదికో ముఖ్యమంత్రి మారుతారని ప్రచారం చేశారు. కాంగ్రెస్ కు ప్రజలు పట్టం కట్టారు. అయినా, బుద్ధి తెచ్చుకోకుండా పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వంపై అదే అబద్ధాల ప్రచారం చేశారు.బిజెపి కోసం బీఆర్ఎస్ ఆత్మబలిదానం చేసుకొని ఏడు ఎంపీ సీట్లలో డిపాజిట్లు కోల్పోవడమే ఇందుకు నిదర్శనం ఆత్మ గౌరవాన్ని బిజెపికి తాకట్టు పెట్టి ఓట్లు బదిలాయించారు.

ఈ నాలుగు నెలల్లోనే రాష్ట్రం నాశనం అవుతుందని, కరెంటు లేదని, పంటలు ఎండిపోతున్నాయని, రైతుబంధు ఇవ్వడంలేదని, వడ్లు కొనడం లేదని, తాగడానికి మంచినీళ్లు లేవని, ఈ విధంగా ప్రజలు గుడ్డిగా నమ్ముతారని అడుగడుగునా అబద్దాల ప్రచారం చేసిన అబద్ధాలను ప్రజలు కర్రు కాల్చి ఆ ఓట్లతో తిప్పి కొట్టి ఒక్క సీటు ఇవ్వకుండా బుద్ధి చెప్పారు. దొరహంకారం తగ్గించుకొని ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహించి ప్రజలు తమకు ఇచ్చిన ప్రతిపక్ష హోదా పాత్రను సమర్థవంతంగా నిర్వహించకుండా ఈ రాష్ట్రాన్ని పాలించడం ఎవరికీ చేతకాదని కేసీఆర్ కుటుంబం పాలిస్తుందని చెప్పుకోవడం ఇది దొరల అహంకారానికి, పెత్తందారుల పోకడకు నిలువెత్తు నిదర్శనం కాదా? అని గుర్తు చేశారు.

# నిబంధనలను తుంగలో తొక్కి అధిక ఫీజులను వసూలు చేస్తున్న సెయింట్ ఆంటోనీస్ పాఠశాల...

### బిల్డింగ్ నాణ్యతపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి...

### నాణ్యత ప్రమాణాలను పాటించని సెయింట్ ఆంటోనీస్ పాఠశాల గుర్తింపు రద్దు చేయండి...

### విద్యార్థి నాయకులు గొల్ల జాన్, నవీన్ యాదవ్



**కూకట్‌పల్లి, జూన్ 6 (నమస్తే ఉదయం):** ఏలాంటి నాణ్యత ప్రమాణాలను పాటించకుండా సుచిత్ర త్రీ టెంపుల్స్ దగ్గర గల సెయింట్ ఆంటోనీ స్కూల్ ను నడిపిస్తున్న యాజమాన్యంపై తగు తీసుకొని పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘం నాయకులు గొల్ల డిమాండ్ చేశారు. గురువారం స్కూల్ యాజమాన్యం వసూలు చేస్తున్న ఫీజుల దోపిడి, బస్సుల నాణ్యత, స్కూల్ బుక్స్ పై అధిక వసూళ్లు, బిల్డింగ్ నాణ్యత తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గొల్ల జాన్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సెయింట్ ఆంటోనీ యాజమాన్యం విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.


పాఠశాల పుస్తకాలలో సైతం విచ్చలవిడిగా దోపిడీ జరుగుతుందని ఆయన మండిపడ్డారు. కాల పరిమితి దాటిన భవనంలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారని గొల్ల జాన్ విమర్శించారు. రానున్న వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని బిల్డింగ్ నాణ్యతపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రధాన రహదారికి అనుకుని ఉండటం వల్ల ఈ పాఠశాలలో విద్యార్థులకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. క్రాంతి దళ్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఈ పాఠశాల పర్మిషన్ బెంటన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు చర్యలు తీసుకోకుంటే విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రెడ్డి , భరత్ రెడ్డి ,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోమొబైల్స్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జూన్06(నమస్తే ఉదయం):** అత్తాపూర్ డివిజన్ సిక్కుచౌనిలో నూతనంగా ఏర్పాటుచేసిన జనతా ఆటోమొబైల్స్ షాపును ఏర్పాటు చేశారు. గురువారం 3వ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... అన్ని వర్గాల వాహనదారుల అవసరాలకు తగ్గట్లుగా మోటార్ బైకులకు స్పేర్ పార్ట్స్ లను విక్రయించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో షాపు యజమాని షేక్ మెహమూద్,షేక్ ఫైజ్,బీఆర్ఎస్ నాయకుడు షేక్ మతీన్,మొహమ్మద్ షోకతుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ తిమ్మప్ప స్వామి అన్నదాన సత్రానికి పోటెత్తిన భక్తులు

**మల్దకల్, జూన్6(నమస్తే ఉదయం):**
ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాన సత్రానికి గురువారం భక్తులు పోటేత్తారు. వేసవి సెలవులు కావడంతో గత నెల నుండి భక్తులు విపరీతంగా శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నట్లు శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వ్యవస్థాపక వంశీయులు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి తెలిపారు. శ్రీ తిమ్మప్ప స్వామి పకృతి అందాల మధ్య మల్దకల్ లో వెలసిన స్వామిని తెలంగాణ,ఆంధ్ర రాష్ట్ర భక్తులే కాకుండా కర్ణాటక మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని వారందరి కోసమే గద్వాల కాకతీయ టెక్నో స్కూల్ వారు ఉచిత అన్నదాన కార్యక్రమం శ్రీ తిమ్మప్ప స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. గురువారం దాదాపు వెయ్యి మంది వరకు అన్నదానం అందుకున్నారని తెలిపారు. కోరిన కోరికలు తీర్చే దేవుడిగా శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయానికి అమావాస్య రోజు చాలా మంది వరకు భక్తులు వస్తుంటారని చెప్పారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 6(నమస్తే ఉదయం):**
ఫర్టిలైజర్ షాపుల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలుంటాయని గద్వాల మండల వ్యవసాయ అధికారి ప్రతాప్ కుమార్ హెచ్చరించారు. గద్వాల మండలంలోని వివిధ రకాల విత్తన దుకాణాలను, రవాణ ఏజెన్సీలను, ఫర్టిలైజర్ షాపులను గురువారం వ్యవసాయ అధికారులతోపాటు టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా షాపుల్లో విత్తనాలు, పురుగు మందులను పరిశీలించారు.



రైతులకు ఇచ్చే బిల్లులను, స్టాక్ బోర్డులను, స్టాక్ రిజిష్టర్ లను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని ఎంఏఓ ప్రతాప్ కుమార్ పేర్కొన్నారు. విత్తనాలు, మందులు కొనుగోలు చేసిన రైతుకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని, బోర్డుపై ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా నకిలీ మందులు, విత్తనాలను విక్రయిస్తే వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలని, వారి గుర్తింపును గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ జనార్దన్, ఏఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలలు అవుతున్నా.. జీతాలు ఇవ్వరా..?

**మొయినాబాబాద్ జూన్ 06 (నమస్తే ఉదయం):**
మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు మూడు నెలలు అవుతున్నా జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని పంచాయతీ కార్యాదర్శి సంధ్యారాణిని నిలదీశారు. గురువారం హిమాయత్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులంతా ఈరోజు నుంచి మేము పనిలోకి వెళ్లము, మాకు జీతాలు ఇవ్వడం లేదు, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో పంచాయతీ కార్మికులగా పని చేస్తున్నామని నెలనెల జీతాలు ఇవ్వాల్సి ఉన్నా కానీ మూడు నెలల నుంచి మా జీతాలు ఏమైయ్యాయని అని ఆమెను అడిగారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి స్పందిస్తు ప్రతి నెల మీ అటెండెన్సు రిజిస్టర్ మూమెంట్ ప్రకారం



చెక్కును రాసి పంపించామన్నారు. 2-3 రోజుల్లో మీ అకౌంట్లలో పడతాయని తెలపడంతో ఉదయం నుంచి 11 గంటల వరకు పంచాయతీ కార్యాలయంలో ఉన్న సిబ్బంది కార్యదర్శి మాటకు పనుల్లోకి వెళ్లిపోయారు. సంధ్యారాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ వారి వేతనాలు నెలనెల అటెండెన్స్ పంపుతున్నామని కానీ రావడం లేటు అవుతుందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్య రాకుండా పరిష్కరిస్తామని అన్నారు.

## నేడు విద్యుత్తు లేని ప్రాంతాలు

**శంషాబాద్, జూన్6 (నమస్తే ఉదయం):** శంషాబాద్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో చెట్లకు తొలగించడానికి శుక్రవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ బాషా తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని కోత్వాలు కూడా కబా కూడా ఏర్పాటు కాలనీ ఆర్కే టౌన్ షిప్ ప్రాంతాలలో ఉదయం 10 గంటలకు విద్యుత్ సరఫరాల అంతర్యం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. శ్రీనివాస నగర్ ఎయిర్పోర్ట్ కాలనీ మజీద్ గడ్డ చౌదరి గోడ ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు ఈ విషయాన్ని గమనించాలి అన్నారు.

### షాపూర్ సెక్షన్ పరిధిలో..

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఓం జై భవాని విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని తొండు పల్లి కిషన్ గూడ, రాయల్ విల్లా ,కోట్పల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అనంతరం ఉంటుందని ఆయన పేర్కొన్నారు .ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.







## నెహ్రూ జూకు కొత్త అతిథుల రాక..!

**పాట్న జూ జిరాఫీ ఇచ్చేందుకు అంగీకారం**

**హిమాచల్ ప్రదేశ్ నుంచి కొండ గొర్రెలు, సాంబర్ జింకలు రాక.**

**కాన్పుర్ జూ నుంచి సంతాన రక్తమార్పిడి కోసం రాయల్ బెగాల్ టైర్, చిరుత వస్తున్నాయ్.**

**పరస్పర జంతు మార్పిడికి అనుమతించిన సెంట్రల్ జూ అథారిటీ**

**వన్యప్రాణుల సంతానోత్పత్తికి రక్త సంబంధ మార్పిడికి శ్రీకారం : డా. సునీల్ ఎస్. హిరెమంత్**

**రాజేంద్రనగర్,జూన్6(నమస్తే ఉదయం):**
ఇటీవల భారీగా తరలి వచ్చిన సందర్శకులతో జనం కళ వచ్చిన నెహ్రూపార్కుకు ఇక కొత్త జంతు కళ రాబోతుంది. నగర జంతు ప్రదర్శన శాలకు కొత్త అతిధులు వస్తున్నారు. అంతే కాదు తోడు లేని అత్యంత అరుదైన జిరాఫీ తోడు రానుంది. అందుకు సంబంధించి జూపార్కుల పరస్పర జంతు మార్పిడికి సెంట్రల్ జూ ఆధారిటీ అంగీకరించింది. అంతే కాదు ఏమాత్రం ఎదురిచ్చే పనిలేకుండా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని గోపాల్ పూర్ లో గల దౌలధర్ ప్రకృతి పార్కు నుంచి హిమాలయన్ కొండ గొర్రెలు రెండు జతలు, సాంబర్ రకం జింకలు మరో రెండు జతలు వస్తున్నాయి. అయితే ఈ వన్యప్రాణులు పూర్తి ఉచితంగా ఆ జూపార్కు నెహ్రూ జూకు ఇస్తోంది. ఈ విషయాన్ని జూపార్కు ఇంచార్జి డైరెక్టర్, క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరెమంత్ తెలిపారు. అలాగే పరస్పర జూపార్కుల జంతు మార్పిడి పద్ధతిన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ జూలాజికల్ పార్క్ నుంచి రెండు ఆడ చిరుత పులులు, 1:2 చింకార, 1:2 స్వాప్డేర్, ఒక రాయల్ బెంగాల్ టైగర్, జత హాగ్ డీర్, ఒక సాంబార్ జింక నగర జూపార్కు పంపనుంది. అందుకు బంధులుగా నగర జూపార్కు నుంచి కాన్పుర్ జూకు 2:2 ఎర్ర చెవుల స్లయిడర్ తాబేళ్లు, ఒక జత ఎలుగు బంట్లు, రెండు జతల నాలుగు కొమ్ముల జింకలు, ఒక తెల్లపులి, ఒక జత హాగ్ డీర్స్, ఒక



సాంబార్ జింకను పంపనున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఖడ్గమృగం ఇచ్చిన పాట్నా జూ ఈసారి జిరాఫీ ఇవ్వడానికి సమ్మతించినట్లు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరెమంత్ తెలిపారు.

**వన్యప్రాణుల సంతానోత్పత్తికి రక్త సంబంధ మార్పిడికి శ్రీకారం డా. సునీల్ ఎస్. హిరెమంత్**

మానవుల మాదిరి మేనరికంతో పుట్టె సంతానం జన్యుపర



మైన సమస్యలు వన్యప్రాణుల్లో ఉంటుందని ఇంచార్జి డైరెక్టర్, జూపార్కు క్యూరేటర్ డాక్టర్ ఎస్. సునీల్ ఎస్. హిరెమంత్ అన్నారు. ఒకే రక్త సంబంధం కలిగిన వన్యప్రాణుల సంఖ్య నెహ్రూ జూపార్కులో అధికంగా ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. దాంతో కొన్ని రకాల జంతువులు చిన్న వయస్సుల్లోనే జన్యు పరమైన సమస్యల కారణంగా బలహీనంగా మారే అవకాశం ఉంటుంది.

దాంతో వాటికి పుట్టె పిల్లలు కూడా మరింత బలహీనంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నిపుణులతో సమీక్షలు నిర్వహించిన వారి సలహాలు, సూచనలతో రాయల్ బెంగాల్ టైగర్, చిరుత పులులో రక్తమార్పిడి వన్యప్రాణుల సంతానోత్పత్తి ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. అలాగే జింక జాతిలో పలు రాకల జింకలపై కూడా అదే విధానం కొనసాగించే వీలు కాన్పూర్, హిమాచల్ ప్రదేశ్ నుంచి వస్తున్న వన్యప్రాణులతో కొనసాగించే వీలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇక జిరాఫీని ఇవ్వడానికి పాట్న జూపార్కు అంగీకరించడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. గురువారం సాయంత్రం ఈ విషయాన్ని పాట్న జూ అధికారులు దృవీకరించినట్లు వెల్లడించారు.

## శంషాబాద్ మండలంలో కొనసాగిన బిజెపి హవా..

**ఏకంగా పదివేల ఆధిక్యంతో దూసుకుపోయిన కమలం**

**బిజెపి మండల అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య.**



**శంషాబాద్, జూన్ 6( నమస్తే ఉదయం):**
ఇటీవల జరిగిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల్లో శంషాబాద్ మండలంలో భారతీయ జనతా పార్టీ హవా కొనసాగిందని తమ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పదివేల ఓట్ల మెజారిటీ లభించిందని శంషాబాద్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య తెలిపారు.

పార్టీ అభ్యర్థి విజయానికి తోడ్పడిన పార్టీ నాయకులు కార్యకర్తలు ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉరవూరిగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి. బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లకు వచ్చిన ఓట్ల కన్నా బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి అధిక ఓట్లు లభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి 18000 పైచిలుకు ఓట్లు లభించగా కాంగ్రెస్ అభ్యర్థికి మాత్రం 8558 ఓట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్. టిఆర్ఎస్ పార్టీలను శంషాబాద్ ప్రజలు పూర్తిగా తిరస్కరించారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ నాయకులు కార్యకర్తలు ఏకతాటిపై పనిచేసి సర్పంచ్. ఎంపీటీసీ. జెడ్పీటీసీ. ఎంపీపీ పంచాయతీ సభ్యుల ఎన్నికల్లో తమ ప్రతినిధులను ఎన్నుకోవాలని గ్రామస్థాయి నుండి పార్టీ స్థానికి కృషి చేయాలని చిటికెల వెంకటయ్య పిలుపునిచ్చారు.

చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అండదండలతో నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేయడానికి అందరూ కృషి చేయాలని అన్నారు.

## వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించిన ఎంపీపి

**గద్వాల, జూన్6(నమస్తే ఉదయం):**
గట్టు మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి ,విద్యుత్ ఏఈ , వ్యవసాయ విస్తరణ అధికారులతో వచ్చే వ్యవసాయ సీజన్ కు వ్యవసాయ అవసరాల గురించి రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయాలని కావలసిన విత్తనాలు ,మందులను ఇప్పటికే ఇండెంట్ పెట్టి తెప్పించాలని గ్రామాలలో రైతు వేదికలలో అందుబాటులో ఉండి రైతులకు కావలసిన వ్యవసాయ సూచనలు చేస్తూ రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

విద్యుత్ ఏ ఈ మీ సిబ్బందిని ఎప్పుడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు రైతులకు కావలసిన నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలన్నారు ఏ చిన్న పాటీ గాలి వర్షం వచ్చిన కరెంటు సమస్యలు ఎక్కువగా అవుతున్నది కనుక ఆ పరిస్థితి రాకుండ విద్యుత్ సిబ్బంది ముందే తగు జాగ్రత్తలు తీసుకుని అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు .డీడీలు కట్టిన రైతులకు వెంటనే కావలసిన విద్యుత్ మెటీరియల్ ను ఈ సీజన్ కి అందించాలన్నారు.



ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి హనుమంత్ రెడ్డి మండల పరిషత్ సూపర్డెంట్ రఘునందన్ రావు మండల విద్యుత్ ఇంజనీర్ చెన్నయ్య అన్ని క్లస్టర్ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనలో ఎల్లప్పుడూ ముందుంటా...

**సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్..**

**కూకట్పల్లి, జూన్ 6 (నమస్తే ఉదయం):**
ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనలో ఎల్లప్పుడూ ముందుంటానని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీ నగర్లో రోడ్డు నెంబర్ 1, 4 లో సీసీ రోడ్ల కొరకు గతంలో పదిహేను లక్షల రూపయులు నిధులు మంజూరై, ఇప్పుడు నిర్మాణ పనులు పూర్తయిన, నిర్మాణ దశలో ఉన్న రెండు గల్లీలలోని సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల



విషయంలో రాజీ పడకుండా సిసి రోడ్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అలాగే నిర్మాణ పనులు పూర్తయిన సీసీ రోడ్డును మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. నూతన సీసీ రోడ్లు నిర్మించినందుకు కాలనీ వాసులందరు హర్షం వ్యక్తం చేసి కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, అంజయ్య యాదవ్, బాలరాజు, కె.రమేష్, పోశెట్టిగౌడ్, రాజేందర్, పదయ్య, పోచయ్య, ఎల్.రాజు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.